మా మాట

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో మొదటి ఇంటర్నేషనల్ స్థాపన ఒక ప్రధాన ఘట్టం. కార్మిక వర్గ విముక్తికి కార్మిక వర్గమే చోదక శక్తి కావాలన్న లక్ష్యంతో ఏర్పడిన మొట్టమొదటి అంతర్జాతీయ సంస్థ ఇది. దీనిలో మార్క్స్, ఏంగెల్స్‌లు కీలకపాత్ర పోషించారు. సంస్థ ఏర్పడి 2014 సంవత్సరానికి 150 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఆంగ్లంలోనికి గతంలో రాని కీలకమైన పత్రాలను సంకలనం చేసి, ఒక విస్తారమైన ఉపోద్ఘాతంతో ఒక ప్రచురణ వచ్చింది. అంతర్జాతీయ యువ మార్క్సిస్టు మేధావి మార్సెల్లో మస్తో సంపాదకత్వంలో ఈ సంకలనాన్ని **వర్కర్స్ యునైట్! ది ఇంటర్నేషనల్ 150 ఇయర్స్ లేటర్** పేరిట బ్లూమ్స్‌బరి ప్రచురణసంస్థ 2014లో ముద్రించింది. కార్మిక వర్గ ప్రస్థానంలో మొదటి ఇంటర్నేషనల్‌కున్న స్థానాన్ని, దానికున్న చారిత్రక పాత్రను లోతుగా సమీక్షిస్తూ మార్సెల్లో మస్తో రాసిన ఉపోద్ఘాతానికున్న ప్రాధాన్యత రీత్యా దాని తెలుగు అనువాదాన్ని ప్రచురిస్తున్నాం.

ఇది సమీక్ష ప్రచురణలు తీసుకువస్తున్న ఎనిమిదో పుస్తకం. 19వ శతాబ్ది నాటికే పెట్టుబడిదారీ ప్రపంచీకరణ ప్రారంభమైంది. ఈ క్రమాన్ని **కమ్యూనిస్టు మానిఫెస్టో** చక్కగా వివరించింది. దీనికి దీటైన స్పందనే 1864లో అంతర్జాతీయ కార్మిక సంస్థ (మొదటి ఇంటర్నేషనల్) స్థాపన. అక్కడి నుండి పెట్టుబడిదారీ విధానం, సోషలిజం మధ్య ప్రారంభమైన పోరు ఇంకా సాగుతూనే ఉంది. కాని ఈ పోరు ముగిసిపోయిందనీ, పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం లేదని 1990ల ప్రారంభంలో నయా ఉదారవాద మేధావులు ఢంకా బజాయించారు. ఇప్పుడు వాళ్ళ వ్యవస్థని చుట్టుముట్టిన సంక్షోభం నుండి బయటపడడానికి మళ్ళీ మార్క్స్‌ని ఆశ్రయిస్తున్నారు. వాళ్ళు మార్క్స్‌ని మళ్ళీ చదువుకుంటున్నట్లు, సోషలిస్టు శక్తులు కూడా మరింత శ్రద్ధగా మళ్ళీ చదువుకోవాలి. ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రపంచవ్యాప్త ప్రత్యామ్నాయాన్ని ఎలా సాధించాలో ఆలోచించాలి. ఆయా దేశాలలో కృషితో పాటు, అంతర్జాతీయ సహకారానికి కూడా కృషి జరగాలి. వ్యవస్థలు ఏర్పడాలి. ఇందుకుగాను సోషలిజం

సాధన కోసం 19, 20 శతాబ్దాలలో ఏర్పడిన అంతర్జాతీయ సంస్థల అనుభవాలను మదింపు వేసుకుని, విలువైన వాటిని ఇప్పటి కార్యాచరణకు అన్వయించుకోవాలి. దీనికోసం ఆ సంస్థల సిద్ధాంతాలను, ఆచరణను సమీక్షిస్తూ సాహిత్యం రావాలి. **సమీక్ష** ప్రచురణలు తీసుకువస్తున్న ఈ పుస్తకం ఇందుకోసం కొంతమేరకు ఉపయోగపడినా మా ప్రయత్నం ఫలించినట్లే.

'వివరణలు'లో కొన్నిటికి డాక్యుమెంట్లు వాటి సంఖ్యతో పేర్కొనబడ్డాయి. ఇక్కడ డాక్యుమెంట్లు అంటే మార్సెల్లో మస్తో ఉపోద్ఘాతం (అంటే ప్రస్తుత తెలుగు పుస్తకానికి ఆంగ్ల మూలం) రాసిన **వర్కర్స్ యునైట్! ది ఇంటర్నేషనల్ 150 ఇయర్స్ లేటర్** అనే ఆంగ్ల పుస్తకంలో ఇవ్వబడిన మొదటి ఇంటర్నేషనల్ డాక్యుమెంట్లు. ఈ పుస్తకం వెంటనే అందుబాటులో లేనప్పటికీ, సాంకేతికంగా "వివరణలు" అన్నీ అనువాదం చేయడంలో భాగంగా ఇచ్చాము. అలానే వీటిలో అనేక ఫ్రెంచి, జర్మన్ రచనల ప్రస్తావన ఉన్నది. వాటి అనువాదం కాని, లిపి అంతరీకరణ కాని సాధ్యంకాక ఆయా భాషలలో వచ్చిన పుస్తకాలు అని రాశాము. ఈ రచనలో అనేక మంది చారిత్రక వ్యక్తులు, సిద్ధాంతవేత్తలు, ఉద్యమకారులు ప్రస్తావించబడ్డారు. అందరి గురించీ కాకపోయినా, కొందరు ప్రముఖ చారిత్రక వ్యక్తులు, సిద్ధాంతవేత్తలు, ఉద్యమకారులను క్లుప్తంగా పరిచయం చేస్తూ 'పేర్ల సూచిక' పుస్తకం చివర ఇచ్చాము. పాఠకులు ఈ అంశాలను గమనించవలసిందిగా కోరుతున్నాము.

ఫిబ్రవరి 20, 2016న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని శాస్త్రీయ సామ్యవాద అధ్యయన కేంద్రంలో ఉపన్యసించటానికి మార్సెల్లో మస్తో వస్తున్నారు. ఆ సందర్భంగా తేదలచిన తెలుగు అనువాద ప్రచురణను సాధ్యం చేసిన వ్యక్తి సుంకర రామచంద్రరావు. అడిగినదే తడవుగా అతి స్వల్ప సమయంలో మస్తో వ్యాసాన్ని చక్కటి తెలుగులో అనువదించి ఇచ్చినందుకు ఆయనకు ముందుగా ధన్యవాదాలు. వివరణలలో ఉన్న ఫ్రెంచి, జర్మన్ మాటలకు అర్థ వివరణ రాసి ఇచ్చిన ఆచార్య వై. రంగారెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. అన్నింటికి మించి తెలుగు అనువాదానికి అంగీకరించిన మార్సెల్లో మస్తోకు మరీ మరీ ధన్యవాదాలు.

తక్కువ సమయంలోనే పుస్తక ప్రచురణ సాధ్యం చేసిన కంపోజర్ శ్రీదేవి గారికి, అందంగా ముద్రించి ఇచ్చిన శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు గారికి ధన్యవాదాలు.

–సమీక్ష